కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్సీ శేరి

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్సీ శేరి

మెదక్, (నమస్తే తెలంగాణ)/మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 17: ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం శేరికి కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మెదక్‌తో పాటు హవేళీ ఘనపూర్ మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మెదక్ మహిళా శిశుసంరక్షణ దవాఖానలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. హవేళీఘనపూర్‌లో కేక్ కట్ చేశారు.



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

21న మెదక్‌లో వాహనాల వేలం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 17: యజమానులు తీసుకెళ్లని వాహనాలను ఈ నెల 21న జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వేలం వేయనున్నట్లు (స్క్రాప్) ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆరు నెలలుగా ఎవరూ రాకపోవడంతో 103 వాహనాలను బహిరంగంగా వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొని వాహనాలు తీసుకెళ్లాలని ఎస్పీ తెలిపారు. వివరాలకు ఆర్ఎస్సై మహిపాల్ 8712657911, 87126576301 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మనస్తాపం చెంది యువకుడి ఆత్మహత్య

భానుప్రసాద్(ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 17: యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేటకు చెందిన కొమ్మాట భానుప్రసాద్ (26) అదే గ్రామానికి చెందిన బిందును ప్రేమించాడు. ఇద్దరి వరుసలు కలవకపోవడంతో భానుప్రసాద్ తల్లిదండ్రులు పెండ్లికి నిరాకరించి, మిరుదొడ్డి గ్రామానికి చెందిన రమ్యతో ఏడాది క్రితం వివాహం జరిపించారు. బిందు కూడ తనను పెళ్లి చేసుకోవాలని భానుప్రసాద్‌ను వేధించింది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలోని పొలం వద్ద నున్న చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం మృతుడి తల్లి శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి: డీఈవో

శివ్వంపేట, ఆగస్టు 17: విద్యార్థులు తమ లక్ష్యాలు సాధించాలంటే ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రులు ప్రోత్సాహం అవసరమని డీఈవో రాధాకిషన్ తెలిపారు. శనివారం మండలంలోని రత్నాపూర్, పిల్లుట్ల ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి కావాలంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంత ఉంటుందో తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే అవసరమన్నారు. సమావేశంలో ఎంఈవో బుచ్యానాయక్, హెచ్ఎం వేణుగోపాల్, టీచర్ల మహేశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, విఠల్‌రెడ్డి, లతీఫా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెద్దశంకరంపేట,ఆగస్టు17: పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. మండలలోని కమలాపురం గ్రామానికి చెందిన కలాలి నాగమణికి రూ.60 వేలు, కమలాపురం తండాకు చెందిన రూప్లానాయక్‌కు రూ.42 వేలు, లక్ష్మాపురం గ్రామానికి చెందిన గంగ రాములుకు రూ.20 వేలు, మహేందర్‌కు రూ.60 వేల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు శ్రేయారెడ్డి, కన్నయ్యగారి రమేశ్, యాదగిరి, తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం, ఆగస్టు 17: పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సతీశ్ అన్నారు. శనివారం తహసీల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, బల్‌రాం, నర్సింహారెడ్డి, భాస్కర్, బాల్‌కిషన్, చెన్నప్ప, సదానందం, చంద్రశేఖర్, బేతయ్య, అభిలాశ్, శ్రీనివాస్, జైపాల్ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రామాయంపేట/శివ్వంపేట, ఆగస్టు 17: రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ రుణమాఫీ వర్తింప జేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నదన్నారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, లెక్కా పత్రం లేకుండా చేశామని సంకలు గుద్దుకోవడం సరికాదన్నారు. సగానికిపైగా రైతులకు రుణాలు మాఫీ కాలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

కొడిపల్లి, ఆగస్టు17: కొడిపల్లి మండలం ధర్మాసాగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాల గౌని సంతోష్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు.

రా రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలి

మెదక్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ):రా రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లు వ్యవస్థ వ్యవసాయ రంగానికి వెన్నెముక వంటిదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 125 శాతం బియ్యం పెనాల్టీ కింద పెట్టాలని, వడ్డీ 12 శాతం కట్టాలని అనడం తగదన్నారు.

సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీరేశం

రా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉట్కూరి వీరేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాడి గణపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరేశంను సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉన్న రా రైస్ మిల్లర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని వీరేశం తెలిపారు. సమావేశంలో లక్ష్మణ్, రమేశ్‌చందర్, శ్రీనివాస్, మధుపంతులు, వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ జోన్ సాధనే టీఎన్జీవో లక్ష్యం

మెదక్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): చార్మినార్ జోన్ సాధనే లక్ష్యంగా దశల వారీ ఉద్యమానికి కార్యాచరణ చేపట్టాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ తెలిపారు. శనివారం టీఎన్జీవో సంఘ భవనంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను రాజన్న జోన్‌లో చేర్చడంతోనే ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. మెదక్ కంటే తక్కువ మెరిట్‌తో ఉన్న నిరుద్యోగులు చార్మినార్ జోన్‌లో ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకమయ్యారన్నారు. సమావేశంలో జిల్లా సహా అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఫజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శులు శివాజీ, కిరణ్ కుమార్, అర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, క్రీడల కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

మెదక్ ర్యాలీలో ప్రైవేట్ డాక్టర్లు, సిబ్బంది

రామాయంపేటలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల నిరసన



మెదక్ మున్సిపాలిటీ: మహిళా మోర్చా ఆధ్వర్యంలో..

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

మెదక్, (నమస్తే తెలంగాణ)/రామాయంపేట/మెదక్ మున్సిపాలిటీ/కౌడిపల్లి/శివ్వంపేట, ఆగస్టు 17: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో వైద్య విద్యార్థులపై అత్యాచారం, హత్య చేయడాన్ని నిరసిస్తూ మెదక్ జిల్లా వ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బీఆర్ఎస్వీ, సీఐటీయూ, ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం నిరసనలు తెలిపారు. ప్రాణాలు కాపాడే డాక్టర్లకు దవాఖానల్లో రక్షణ లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న డాక్టర్లే అత్యాచారానికి గురవుతుంటే దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు దేశంలో పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌడిపల్లి: నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న వైద్య సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీలో ఏబీవీపీ నాయకుల నిరసన

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

జావెలిన్ త్రో విసురుతున్న శాప్ చైర్మన్ శివసేనరెడ్డి

400 మీటర్ల పరుగు పందెం విజేతలకు పతకాలు అందజేస్తున్న శాప్ చైర్మన్

- జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు
- శాప్ చైర్మన్ శివసేనరెడ్డి
- 10వ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 17: అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి గౌరవం తెచ్చేలా క్రీడాకారులు పతకాలు సాధించాలని శాప్ చైర్మన్ శివసేనరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగే 10వ స్టేట్ సీనియర్ అండర్-23 అథ్లెటిక్స్ (మెన్ అండ్ ఉమెన్) చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. త్రిపుల్ జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో ఒక్క బంగారు పతకం సాధించలేకపోయమన్నారు. ఈసారి భారత్ తరపున బంగారు పతకాలు సాధించేలా మన క్రీడాకారులు తయారు కావాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు.

25 ఎకరాల్లో క్రీడా మైదానాలు

ప్రతి జిల్లా కేంద్రంలో 25 ఎకరాల్లో క్రీడా మైదానాలు నిర్మించాలని, జాతీయస్థాయిలో రాణించే ప్రతి క్రీడాకారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మెదక్ జిల్లా ప్రాతినిథ్యం వహించడం ఆనందగా ఉన్నదన్నారు. సింథటిక్ ట్రాక్ బాగున్నదని, ట్రాక్‌పై వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫుట్‌బాల్, వాలీబాల్ అకాడమీలు ఏర్పాటు చేయాలి

స్టేడియంలో ఫుట్‌బాల్, వాలీబాల్ అకాడమీలు ఏర్పాటుచేయాలని, క్రీడాకారులకు వసతి గృహం ఏర్పాటు చేయాలని స్పోర్ట్స్ ఫౌండేషన్, పీఈటీ అసోసియేషన్ సభ్యుడు శివసేనరెడ్డికి విజ్ఞప్తి చేశారు. గతంలో ఇండోర్ స్టేడియం పక్కన స్విమ్మింగ్ పూల్ మంజూరైందని, దానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. వెంటనే స్విమ్మింగ్ పూల్ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, శివశంకర్‌రావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, మధుసూదన్, 260 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

వారికి పంట రుణమాఫీ ఎప్పుడో?

- మూడు విడతల్లో రూ.631.11 కోట్లు మాఫీ
- పంట రుణమాఫీ కానీ రైతుల పరిస్థితి ఘోరం
- బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

మెదక్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న రుణమాఫీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మొదటి, రెండో విడతలో పంటరుణమాఫీ కానీ రైతుల పరిస్థితి ఘోరంగా తయారైంది. అసలు మాఫీ అవుతుందా లేదా అన్న సందిగ్ధంలో ఉన్నారు. మూడో విడత రుణమాఫీలో జిల్లాలో రైతులకు 1,78,219 బ్యాంకు ఖాతాలున్నాయి. రేషన్‌కార్డు ఉన్న వారికే పంట రుణమాఫీ వర్తించింది. మొదటి విడతలో 51,492 మందికి రూ.257.68 కోట్లు, రెండో విడతలో 22,850 మందికి రూ.216.15 కోట్లు, మూడో విడతలో 12,306 మంది రైతులకు రూ.157.35 కోట్లు మాఫీ అయ్యాయి. మొత్తం మూడు విడతల్లో మెదక్ జిల్లాకు రూ.631.11 కోట్లు మాఫీ అయినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ పంట రుణాలు తీసుకున్న వారి సంఖ్య అంతకు మూడు రెట్లు ఉన్నప్పటికీ, వారందరికీ మాఫీ కాలేదు. ఇందులో సన్న, చిన్న కారు రైతులు ఉండడంతో వారంతా మనోవేదనకు గురవుతున్నారు. రుణమాఫీ వర్తించని వారి నుంచి ఆయా ఏవోలు, ఏఈవోలు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

సహకార ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

శివ్వంపేట, ఆగస్టు 17: మండలంలోని చిన్న గొట్టిముక్ల పంచాయతీలో గల ప్రసిద్ధ పుణ్య క్షేత్రం చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాస పూజలు చేశారు. ఆంజనేయశర్మ, దేవదత్తుశర్మ ఆధ్వర్యంలో చందనాభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు, పూజలు చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

శివ్వంపేట, ఆగస్టు 17: రెండు రోజుల క్రితం సికింద్లాపూర్ పిట్టలవాడ చెందిన పిట్టల సుశీల ఆమె కోడళ్లు రాణి, రేఖలపై హైదరాబాద్‌కు చెందిన మార్కుండేడ్డి, భూపాల్‌రెడ్డి, వంశీ మరికొంతమంది దాడి చేసి, కులం పేరుతో దూషించారని శివ్వంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ విషయంలో శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి పిట్టలవాడలో విచారణ చేపట్టారు. వివాదానికి కారణమైన భూమి, దానికి సంబంధించిన రికార్డులు, కులం పేరుతో దూషించిన కేసుపై బాధితుల నుంచి సమాచారాన్ని తెలుసుకున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఆయనతో తూప్రాన్ సీఐ రంగ కృష్ణాగౌడ్, శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి, సికింద్లాపూర్ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

పీజీ ర్యాంకర్లకు ఘనంగా సన్మానం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 17: ఉస్మానియా విశ్వవిద్యాలయం విడుదల చేసిన పీజీ ఎంట్రెన్స్ టెస్ట్, ఐసెట్ ఫలితాల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉన్నత ర్యాంకులు సాధించారు. శనివారం కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఎంఎస్సీ ఫిజిక్స్‌లో వైష్ణవి 22వ ర్యాంక్, బయోటెక్నాలజీలో హర్షిత 35వ ర్యాంక్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో వైజయంతి 26వ ర్యాంక్ సాధించారు. 100కు పైగా ర్యాంకులను 50 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు.

మండల వ్యవసాయ అధికారిగా సోమలింగారెడ్డి

నిజాంపేట, ఆగస్టు 17: మండల నూతన వ్యవసాయ అధికారిగా సోమలింగారెడ్డి శనివారం నియమితులయ్యారు. రైతువేదికలో పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు మండల ఇన్‌చార్జి ఏవో రాజ్ నారాయణ, టెక్నికల్ ఏవో సతీశ్ సన్మానించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, కావేరి, ఎరువుల డీలర్లు రాజు, శ్రీను, రమేశ్ ఉన్నారు.

సోమలింగారెడ్డిని సన్మానిస్తున్న మండల ఇన్‌చార్జి ఏవో తదితరులు

రామాయంపేట సబ్‌స్టేషన్‌లో బాధ్యతలను చేపట్టిన ఏడీఈ ఆదయ్య

బాధ్యతలు చేపట్టిన ఏడీఈ ఆదయ్య

రామాయంపేట, ఆగష్టు 17: రామాయంపేట విద్యుత్ సబ్‌డివిజన్ సబ్‌స్టేషన్‌లో ఏడీఈగా ఆదయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. 1104 యూనియన్ నాయకులు ఏడీఈని సన్మానించారు. సబ్ డివిజన్‌ను జిల్లాలోనే ఆదర్శంగా తయారుచేద్దామన్నారు. కార్యక్రమంలో పరుచూరి రాజేశ్వర్, ఎల్లం, అనిల్, రాజేశ్ ఉన్నారు.

ఓటర్ల జాబితా సవరణ పక్కాగా చేపట్టాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఓటర్ జాబితా సవరణపై దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ముఖ్య అధికారులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ చేపట్టేందుకు సిద్ధంకావాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారుల (బీఎల్వో) ద్వారా ఇంటింటా జాబితాల పరిశీలించాలన్నారు. ఏటా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు 1వ తేదీల్లో కొత్త ఓటర్ల నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆర్డీవోలను ఆదేశించారు. బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చి ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. మార్గదర్శకాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలిగింపు, చిరునామాల మార్పు, చేర్పుల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలన్నారు. వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించేందుకు సమావేశం ఏర్పాటుచేయాలన్నారు. ఓటరు జాబితాలో సాంకేతికంగా ఎలాంటి తప్పులు లేకుండా, సవరణ, మార్పులు చేర్పులు చేపట్టి ఈ నెలాఖరులో గా సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, శివ్వంపేట తహసీల్దార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వాళ్లు దాడులు చేయడం గర్హనీయం

నర్సాపూర్, ఆగస్టు17: కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ వాళ్లపై దాడులు చేయడం గర్హనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులుఖండించారు. అర్ధరాత్రి ప్రభుత్వ కార్యాలయాన్నా ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గ్యారెంటీలు, రుణమాఫీ అమలులో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, నాయకులు సత్యంగౌడ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, శివకుమార్ పాల్గొన్నారు.

ఆడపిల్లలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, ఆగస్టు 17: ఆడపిల్లలపై దాడులకు పాల్పడినా, అవమానాలకు గురిచేసినా చట్టపరీత్యా శిక్షించబడతారని జూనియర్ సివిల్ జడ్జి అనిత హెచ్చరించారు. శనివారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చట్టాలపై అవగాహన లేక స్థిరాస్తుల క్రయవిక్రయాలు తెల్ల పేపర్లపై రాసుకుంటూ, తరచూ పలు వివాదాలతో మండల్ లీగల్ సర్వీస్‌ను ఆశ్రయిస్తున్నారన్నారు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు చేసినప్పుడు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా న్యాయమూర్తి పలు పీఎల్‌సీ కేసులను పరిష్కరించారు. లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపా రాణి, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎల్ఎం కుటుంబానికి ఆర్థిక సాయం

అల్లాదుర్గం, ఆగస్టు 17: విద్యుల్లో శాఖలో విధులు నిర్వహిస్తున్న తమ్మనగారి గణేశ్ గత నెల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. శనివారం విద్యుత్ శాఖ అధికారులు గణేశ్ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. పాపన్నపేట డీఈ మోహన్‌బాబు, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్, వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, అల్లాదుర్గం, రేగోడ్ ఏఈలు శివాజీ, యాసిన్, నవాజ్, రమేశ్, సురేశ్, కిరణ్, రామకృష్ణ, సాయిలు, సాధిక్, ఫణింధర్, తుల్జారాం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల/కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్, ఆగస్టు 17: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రవి ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 20, బైపీసీలో 11, 9వ తరగతిలో 30 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీన హాజరుకావాలని సూచించారు.

జిన్నారం గురుకులంలో..

జిన్నారం, ఆగస్టు 17: జిన్నారంలోన గిరిజన గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో ఖాళీల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ, ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీలు భర్తీ చేసేందుకు ఈనెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొనారు. సర్టిఫికెట్లతో గురుకుల వద్దకు రావాలని సూచించారు.

సైబర్ ఉచ్చులో మరో వ్యక్తి

శివ్వంపేట, ఆగస్టు 17: మండలానికి చెందిన మరో వ్యక్తి సైబర్ ఉచ్చులో పడి మోసపోయాడు. ఎస్సై రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఒకరు ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ వస్తుందని చెప్పగా, ఇన్సురెన్స్ ప్రాసెస్ ఫీజు కట్టాలని రూ.48,433 కాజేశాడు. తిరిగి ఫోన్ చేస్తే రెస్పాన్స్ లేదు. మోసపోయాయని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కౌడిపల్లి, ఆగస్టు17: ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహమ్మద్‌నగర్‌కు చెందిన శేఖర్‌గౌడ్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం తన పొలంలో పనులు చేయడానికి వెళ్లాడు. పని చేస్తుండగా ఆయాసం వచ్చి పొలంలోనే పడిపోయాడు. కుటుంబీకులు వచ్చి నర్సాపూర్ దవాఖానకు త